క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామికి ఆషాఢమాసం నాల్గవ శనివారం, శనిత్రయోదశి మాసశివరాత్రి సందర్భంగా వేకువ జాము నుండే స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారిని 26 రకాల కూరగాయలు, పలు ఆకు కూరలతో ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్వామి వారి దర్శనం కోసం స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పోటెత్తారు. ఆలయ పూజారి పెంచలయ్య స్వామి ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

కాశినాయన : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి తెలిపారు. శనివారం నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఓపీ రిజిస్టర్‌తో పాటు పలురకాల రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. అనంతరం వైద్యసిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని రకాల మందులను ప్రభుత్వం సరఫరా చేస్తుందని, ఇక్కడికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల

ప్రొద్దుటూరు : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి.శివకుమార్ కోరారు. శనివారం స్థానిక సృజన్స్ కోచింగ్ సెంటర్‌లో ఉద్యోగాల భర్తీ కోసం ఉద్యమిద్దాం అని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్, నిరుద్యోగులు పాల్గొన్నారు.

పల్లవోలులో వృద్ధురాలి కళ్లు దానం


కనకమ్మ (ఫైల్)

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలోని దళితవాడకు చెందిన పల్లవోలు కనకమ్మ(68) శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ క్రమంలో కనకమ్మ కొడుకు శ్యామ్‌రాజు, కోడలు జ్ఞానమ్మ, కుటుంబీకులు మృతురాలి నేత్రాలను దానం చేశారు. పులివెందులకు చెందిన స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో కనకమ్మ కార్నియాలను తీసుకున్నారు. కనకమ్మ కళ్లను దానం చేయటం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్లడ్‌బ్యాంక్ తనిఖీ


బ్లడ్ బ్యాంక్‌ను తనిఖీ చేస్తున్న డాక్టర్ చంద్రహాసరెడ్డి

పోరుమామిళ్ల : స్థానిక 50 పడకల ఆసుపత్రిలో ఇటీవల ప్రారంభించిన బ్లడ్‌బ్యాంక్‌ను జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ చంద్రహాసరెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ బ్లడ్ బ్యాంక్‌లో అన్ని గ్రూపులకు చెందిన రక్త నిల్వలు ఉండేందుకు కృషి చేయాలన్నారు. ఆసుపత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలని, కాన్పులను ఆన్‌లైన్ చేసి ప్రసవించిన మహిళలకు జేఎస్‌వై పథకం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య విద్యాబోధకుడు పాల్గొన్నారు.

సబ్ రిజిస్టర్‌గా చైతన్య రాయలు

దువ్వూరు : దువ్వూరు మండల సబ్ రిజిస్ట్రార్‌గా శనివారం మీసాల చైతన్య రాయలు బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలు నుంచి దువ్వూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల, ప్రజల భూములను ప్రభుత్వ నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లను చేస్తామని తెలిపారు.

వర్షాకాలంలో పరిశుభ్రత పాటించాలి

ప్రొద్దుటూరు క్రైం : వర్షాకాలంలో పరిసరాల శుభ్రత పాటించడం వల్ల దోమలు వృద్ధి చెందవని జిల్లా మలేరియా నివారణ అధికారి మనోరమ తెలిపారు. డెంగ్యూ నివారణ మాసోత్సవం సందర్భంగా శనివారం కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాల్వకట్ట, ద్వారకానగర్‌లో ఆమె వైద్యాధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశాఖ, సచివాలయాల సిబ్బంది సమన్వయంతో కలిసి పని చేయాలని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతో దోమల ఆవాసాలపై చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. డాక్టర్ హనీఫ్‌బాబా, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్నది వర్షాకాలం కావడంతో ప్రజలు వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీపీ శివప్రసాద్, సీహెచ్ఓ నాగేంద్ర, ఎల్‌టీ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, ఆరోగ్య కార్యకర్త జ్యోతి, ఆశా కార్యకర్తలు స్వర్ణలత, బాలనాగమ్మ, మాబుచాన్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు రక్ష


జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధృవీకరణపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

బద్వేలు అర్బన్ : అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందుకోలేని వారికి లబ్ధిని చేకూర్చడంతో పాటు 11 రకాల సేవలను ఉచితంగా అందించే కృతనిశ్చయంతో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు రక్ష లాంటిదని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగంసుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లె సచివాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, కో ఆప్షన్ మెంబర్ రామచంద్రారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు రఘురామిరెడ్డి, చెన్నయ్య, సుబ్బరాజు, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, డీఈ సుమన్‌రెడ్డి, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని చింతలచెరువు సచివాలయంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్పీటీసీ వంకెలచిన్నపోలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోడపాటి రామసుబ్బారెడ్డిలు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఉప సర్పంచ్ రవికుమార్‌రెడ్డి, తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, మండల స్పెషలాఫీసర్ ఖాదర్‌బాష, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గోపవరంలో..

గోపవరం : మండలంలోని బేతాయపల్లె సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజు పాల్గొని మాట్లాడారు. అర్హత ఉండి ఇంకా సంక్షేమ పథకాలు రాని వారు, వివిధ పథకాల అవసరమైన 11 రకాల ధృవపత్రాలను ఎలాంటి సర్వీసు ఛార్జీలు లేకుండా అందజేయడం జరుగుతుందన్నారు. సచివాలయం పరిధిలో 460 ధృవపత్రాలను ఈ సందర్భంగా లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, ఈఓపీఆర్డీ హసీనా, ఏఓ అరవిందనాయక్, సచివాలయ కన్వీనర్ పుల్లయ్య, సర్పంచ్ లక్ష్మీదేవి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాశినాయనలో..

కాశినాయన : మండలంలోని ఓబుళాపురం గ్రామ సచివాలయం ఆవరణలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ పోలమ్మ, ఎంపీడీఓ మైథిలి, తహసీల్దారు రామచంద్రుడులు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నిరుపేదలకు వివిధ రకాల పథకాలను అందిస్తుందని, ఇంకా ఎవరైనా పథకాలు అందని వారి కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. రంపాడు గ్రామ వలంటీర్లు సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని ఎంపీడీఓ అసహనం వ్యక్తం చేశారు. అనంతరం 220 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, ఈఓపీఆర్డీ ముజఫర్‌రహీమ్, స్థానిక సర్పంచ్ జయన్న, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బి.కోడూరులో..

బి.కోడూరు : మండలంలోని పెద్దుళ్ళపల్లె గ్రామ సచివాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రమణయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొని మాట్లాడారు. పరిష్కారం కాని సమస్యలను కూడా జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిష్కారమవుతున్నాయన్నారు. సచివాలయం పరిధిలో 218 మంది దరఖాస్తు చేసుకోగా 216 మందికి అప్పటికప్పుడే సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుబ్బారెడ్డి, సచివాలయ కన్వీనర్ సొదరిసుబ్బారెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ రాజారెడ్డి, తహసీల్దారు విద్యాసాగర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ, ఎంఎల్ఓ రమణారెడ్డి, హౌసింగ్ ఏఈ వెంకటసుబ్బయ్య, పశువైద్యాధికారి లక్ష్మీనరసయ్య, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా సమస్యలు పరిష్కారం

చాపాడు: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ రామోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిన్నగురువళూరు గ్రామ సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు నెల రోజుల పాటు ఉచితంగా సచివాలయ సేవలు అందించటం జరుగుతుందన్నారు. అన్ని రకాలైన ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తు చేసిన వెంటనే పొందవచ్చన్నారు. మండల వ్యాప్తంగా నిర్వహించే గ్రామ సభలను ఆయా గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాలైన ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు సుభానీ, సర్పంచ్‌లు ఎల్లారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఎంపీటీసీ పార్వతమ్మ, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా ఉచిత సేవలు

దువ్వూరు : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా దరఖాస్తుదారులకు ఉచితంగా సర్టిఫికెట్లను అందిస్తున్నట్లు తహసీల్దార్ రమకుమారి తెలిపారు. మండలంలోని కానగూడూరు గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 11 రకాల సర్టిఫికెట్లను దరఖాస్తు దారులకు ఉచితంగా అందిస్తామన్నారు. కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు, రైస్ కార్డులను అందిస్తున్నట్లు చెప్పారు. వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఎవరికి ఏ సర్టిఫికెట్ అవసరమో గుర్తించాలన్నారు. అనంతరం దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ అమరనాథ్‌రెడ్డి, సర్పంచ్ కోట్ల బీబీ, ఎంపీటీసీ సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సానేపల్లె కిరణ్‌కుమార్ రెడ్డి, సురేంద్ర, బాషా తదితరులు పాల్గొన్నారు.


ఓబుళాపురంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


పెద్దుళ్ళపల్లెలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న మండల కన్వీనర్, ఉపాధ్యక్షుడు


చాపాడు : చిన్నగురువళూరులో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సేవకు సలాం



వలంటీర్ సాయంతో పింఛన్ మంజూరు


పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మోపూరి సలోమి

ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధుడు వల్లూరు నారపరెడ్డి నుంచి వేలి ముద్రలు తీసుకుంటున్న గ్రామ వలంటీరు పేరు మోపూరి సలోమి. మండలంలోని పడమర అనంతపురం గ్రామానికి చెందిన వల్లూరు నారపురెడ్డికి 80 ఏళ్ల వయస్సు ఉన్నప్పటికీ వృద్ధాప్య పింఛను రాకపోవటాన్ని మూడేళ్ల క్రితం ఇంటింటి సర్వేలో వలంటీరు సలోమి గుర్తించింది. వెంటనే పింఛను కోసం దరఖాస్తు చేయించి వేలి ముద్రలు తీసుకుంది. దీంతో అతడికి వృద్ధాప్య పింఛను మంజూరై మూడేళ్లుగా పింఛన్ తీసుకుంటున్నాడు.

– చాపాడు

టీడీపీ హయంలో పింఛన్ ఇవ్వలేదు



టీడీపీ హయాంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసినా జన్మభూమి కమిటీ సభ్యులు పింఛన్ మంజూరు చేయలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే మా వలంటీరు సలోమి ఇంటి వద్దకు వచ్చి నా ఆధార్ కార్డు చూసి నీకు ముసలోళ్ల పింఛను వస్తుందని చెప్పి వేలి ముద్రలు తీసుకుంది. మూడేళ్ల నుంచి నాకు ప్రతి నెలా ఇంటి వద్దకు వచ్చి పింఛన్ డబ్బు ఇస్తోంది.

- సువర్ణ, లింగాలదిన్నెపల్లె, బి.మఠం మండలం

నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు


పూల మహబూబ్‌బీకి పింఛన్ ఇస్తున్న వలంటీర్ సమ్రిన్ భాను

ఈమె పేరు ముల్లా సమ్రిన్ భాను. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని 27వ సచివాలయంలో 16వ క్లస్టర్‌లో వలంటీర్‌గా పనిచేస్తోంది. ఎంఎస్సీ చదివిన ఈమె వలంటీర్ వ్యవస్థ ప్రారంభం నుంచి వలంటీర్‌గా పనిచేస్తూ మట్టి మసీదు వాసుల మన్ననలను అందుకుంటున్నారు. కోవిడ్ సమయంలో వీధి ప్రజలందరికి ప్రభుత్వం ఆదేశించిన మేరకు సేవలు చేశారు. వీధిలో సోడియం హైపోక్లోరైడ్ మందును పిచికారి చేయించడం, వైద్య సిబ్బంది సహాయంతో ప్రజలకు రక్త పరీక్షలు చేయించడం, నిత్యావసర వస్తువులు తెప్పించడం లాంటి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

– ప్రొద్దుటూరు

ఆపదలో వలంటీర్ సేవలను మరిచిపోలేను



వలంటీర్ ముల్లా సమ్రిన్ భాను కోవిడ్ సమయంలో అందించిన సేవలను మరిచిపోలేను. నాకు డయాలసిస్ పింఛన్ రూ.10వేలు, బీటెక్ చదువుతున్న నా కుమారుడు మహమ్మద్ ముస్తఫాకు జగనన్న విద్యాదీవెన, కుమార్తె హఫీసా భానుకు అమ్మ ఒడి, నా సతీమణి దిల్‌షాద్‌కు రామేశ్వరం జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు చేయించారు. నిత్యం అందుబాటులో ఉంటూ వలంటీర్ సేవలు అందిస్తున్నారు.

- పసుపాల ఖాదర్ మొహిద్దీన్, 27వ సచివాలయం, ప్రొద్దుటూరు

డ్వాక్రా రుణాలను మాఫీ చేసింది ఈ ప్రభుత్వమే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : డ్వాక్రా రుణాలను మాఫీ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 30, 31, 32 సచివాలయాల పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం విడతల వారిగా ప్రభుత్వం డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తోందన్నారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు అధికారంలోకి వచ్చాక నెరవేర్చలేదన్నారు. నిష్పక్షపాతమైన పరిపాలనకు, నిజాయితీకి ఈ ప్రభుత్వమే నిదర్శనమని తెలిపారు. చంద్రబాబు పాలనకు, జగన్ పాలనకు వ్యత్యాసాన్ని గమనించాలని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు. ఈ ప్రభుత్వంలోనే పేదలందరికి ఇళ్లు మంజూరయ్యాయని, మున్సిపాలిటీలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేస్తున్నామని, పెన్నానదిపై బ్రిడ్జి నిర్మిస్తున్నామన్నారు. మున్సిపల్ పార్కు నిర్మాణం పూర్తయిందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్లు పాతకోట మునిశంఖర్‌రెడ్డి, మోతుకూరు జయలక్ష్మి, బలిమిడి వెంకటలక్ష్మి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి పోసా భాస్కర్, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ శంకర్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం


పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న ఎంఈఓ సావిత్రమ్మ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని రమణ మహర్షి ఎయిడెడ్ హైస్కూల్‌లో శనివారం 1985–86 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సమావేశం ఏర్పాటు చేశారు. 2021–22, 2022–23 సంవత్సరాల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు రూ.7,500 చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10,000 అందించారు. విద్యార్థులకు అవసరమైన ఆట వస్తువులు, సైన్స్, సోషల్ చార్ట్స్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం, విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ వెంకటరమణ, కరస్పాండెంట్ కేఎస్ ఆచారి, ప్రధానోపాధ్యాయులు ఎ.రవిప్రకాష్, ఎస్.సుబ్రహ్మణ్యం, పూర్వ విద్యార్థులు వంశీకృష్ణ, ఎంఈఓ భువన్ సుందర్‌రెడ్డి, ఉమాకాంత్‌రెడ్డి, సతీష్ కుమార్, ప్రభు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘కలియుగ పట్టణం’ పోస్టర్ విడుదల


పోస్టర్ విడుదల కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

కడప ఎడ్యుకేషన్ : నాని మూవీ వర్క్స్ అండ్ రామా క్రియేషన్స్ పతాకంపై విశ్వ కార్తికేయ, ఆయుషి పటేల్ హీరో హీరోయిన్లుగా రమాకాంత్‌రెడ్డి దర్శకత్వంలో కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, కాటం రమేష్‌లు కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్న కలియుగ పట్టణం సినిమా విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం అంజాద్‌బాష పేర్కొన్నారు. శనివారం కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాష చేతుల మీదుగా ఈ మూవీ టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ ఈవెంట్‌కు డిప్యూటీ సీఎంతోపాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్జల్‌ఖాన్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డెప్పగారి శ్రీనివాసులరెడ్డి, ఏపీ ఇండస్ట్రీస్ అడ్వైజర్ రాజోలి వీరారెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, ఆర్ఎల్‌టి గ్రూపు చైర్మన్ అమీర్‌బాబు, టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ చిన్నపురెడ్డి, నాగార్జున మోడల్ స్కూల్ చైర్మన్ శివశంకర్‌రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాష మాట్లాడుతూ నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా ఉండే సినిమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పోస్టర్ లాంచ్ చేసిన అనంతరం చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్ తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్శన్ కందుల రాజేశ్వరమ్మతోపాటు పలువురు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి

గడప గడప కు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నిరుపేదకు లబ్ధి చేకూరేలా పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం బి.మఠంలో సుగాలితాండా, పాతూరు, జగంరాజుపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వంలో కార్యక్రమంలో ఇంటింటికి ఎమ్మెల్యే వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నిరుపేదకు ప్రభుత్వం అందిస్తున్న పథకం తప్పకుండా అందేలా వలంటీర్లు సేవలు అందిస్తున్నారన్నారు. ఎక్కడా ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సుగాలి తాండాలో స్థానిక ప్రజలు పక్కాగృహాలు, డ్రైనేజీలు కావాలని ఎమ్మెల్యేను కోరారు. రూ. 2లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పాతూరులో బ్రహ్మంగారి నివాసం దగ్గర నుంచి సీసీ రోడ్డు కావాలని స్థానికులు కోరారు. సీసీ రోడ్డును రూ.12 లక్షలతో టెండర్లు పిలిచామని, వారం రోజులలో పలును ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మేకల రత్నకుమార్ యాదవ్, గ్రామ సచివాలయాల కన్వీనర్ రాజానాయుడు, సర్పంచ్ సోమిరెడ్డిపల్లె రామయ్య, ఎంపిటీసీలు యల్లటూరి ఈశ్వర్‌రెడ్డి, మనోహరాచారి, నాయకులు బి. కృష్ణారెడ్డి, మణ్యం శంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, యల్లటూరి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం సోమిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం–2లో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఇంకా అర్హత ఉండి లబ్ధిపొందని వారికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్లు గుర్తించి ఎంపిక చేయాలని తెలిపారు. ఎంపిడీఓ వెంగమునిరెడ్డి మాట్లాడుతూ సచివాలయ పరిధిలో 670 సర్టిఫికెట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సువర్ణదేవి, సర్పంచ్ ఎస్.రామయ్య, ఎంపీటీసీ ఈశ్వర్‌రెడ్డి, డీటీ జాన్సన్, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సొసైటీల ద్వారా రైతులకు విరివిగా రుణాలు

పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఇరగంరెడ్డి విశ్వేశ్వర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ


పీఏసీఎస్ అధ్యక్షుడు ఇరగంరెడ్డి విశ్వేశ్వరరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా ప్రభుత్వం రైతులకు విరివిగా రుణాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన దువ్వూరులోని కేసీ కెనాల్ బంగ్లా ఆవరణలో శనివారం దువ్వూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఇరగంరెడ్డి విశ్వేశ్వర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ దువ్వూరు మండలంలో ఒకప్పుడు ఐదు సొసైటీలు దువ్వూరు, చింతకుంట, కానగూడూరు, మదిరేపల్లె, ఎర్రబల్లెలలో ఉండేవని, తర్వాత ప్రభుత్వం మండలానికి ఒక సొసైటీని ఏర్పాటు చేసిందన్నారు. ఈ సొసైటీ ద్వారా రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీకే రైతులకు రుణాలు అందిస్తారని వివరించారు. సొసైటీలో సకాలంలో రుణం తిరిగి చెల్లించిన రైతులకు 6 శాతం డివిడెండ్ అందిస్తారన్నారు. 1995లో దువ్వూరు పీఏసీఎస్ అధ్యక్షుడుగా తాను పనిచేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు వ్యవసాయానికి సంబంధించిన అన్ని రుణాలు అందిస్తారని చెప్పారు. నూతన అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన ఇరగంరెడ్డి విశ్వేశ్వరరెడ్డిని అభినించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ 2013, 2019 రెండు సార్లు డీసీసీబీ చైర్మన్‌గా పనిచేసి రైతులకు విరివిగా రుణాలు అందించానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, సర్పంచ్ దండు చెంద్రాయుడు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చిరాకి బాషా, డీసీసీబీ మేనేజర్ రవికుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఓబుళ కొండారెడ్డి, సంఘం సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కార్యాలయాల్లో తెలుగు అమలుపై హర్షం


పోలీస్‌స్టేషన్‌లో పత్రాలు పరిశీస్తున్న తవ్వా వెంకటయ్య

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల, కలసపాడు విద్యాశాఖ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్‌లలో తెలుగు అమలు గురించి పరిశీలించేందుకు శనివారం రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటసుబ్బయ్య వచ్చారు. క్షేత్రస్థాయిలో పోలీస్‌స్టేషన్‌లలో తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయా? ఫిర్యాదులు తెలుగులోనే ఉంటున్నాయా? అన్న అంశాలను ఆయన పరిశీలించి 80 శాతం తెలుగులో ఉండటం గమనించి హర్షం వ్యక్తం చేశారు. అధికారుల పేర్లు కూడా తెలుగులో ఉండాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో హాజరు పట్టిక, సెలవులేఖలు, పాఠశాల నామ ఫలకాలు తెలుగులో ఉండేలా చర్య తీసుకోవాలన్నారు. అన్ని రకాల పత్రాలు తెలుగులో కొనసాగాలని అధికారులకు చెప్పారు.